ఈత.. గౌడ్‌లకు చేయూత

- హరితహారంలో 5 ఎకరాలలో 5 వేలకు పైగా మొక్కలు
- ప్రస్తుతం చేతికందిన 600 చెట్లు
- ప్రతిరోజూ 500 లీటర్ల కల్లు
- 60 మంది గౌడన్నలకు ఉపాధి

7లో..



శ్రీ సీతారాముల బంగారు ఆభరణములు



భక్తులకు సీతమ్మతల్లికి కట్టే మంగళసూత్రం చూపిస్తున్న జగ్గారెడ్డి



బంగారు ఆభరణాలను ఊరేగింపుగా తన నివాసం నుంచి రామ్‌మందిర్‌కు తెస్తున్న జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు

సంగారెడ్డిలో జగ్గారెడ్డి దంపతులచే అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం

సంగారెడ్డి, ఏప్రిల్ 17: సంగారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శ్రీ సీతా రాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ సీతారాముల బంగారు ఆభరణాలను ఉదయమే తన నివాసం నుంచి జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మేళతాళాలతో ఊరేగింపుగా రామ్ మందిర్‌కు తీసుకువచ్చారు. రామ్‌మందిర్‌లో రాత్రి జరిగిన శ్రీ సీతారామ కళ్యాణం రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ పర్యావేక్షణలో జ్యోతిర్వాను విద్యాపీఠం సిద్దాంతి మహేశ్వర శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి సీతమ్మ కోసం తయారు చేయించిన మంగళసూత్రంను భక్తులకు చూపించారు. కళ్యాణంలో జగ్గారెడ్డి దంపతులు సీతమ్మ తల్లి శ్రీరామ చంద్రుల విగ్రహాలపై ముత్యాల తలంబ్రాలను పోశారు. అనంతరం ఈ తలంబ్రాలను వేడుకలకు హాజరైన చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలకు జగ్గారెడ్డి దంపతులు అందజేశారు.



కళ్యాణంలో పాల్గొన్న జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి



కళ్యాణంలో శ్రీ సీతారాముల విగ్రహాలపై ముత్యాల తలంబ్రాలు పోస్తున్న జగ్గారెడ్డి దంపతులు



కళ్యాణంలో పాల్గొన్న జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు



తన నివాసంలో బంగారు ఆభరణాలకు పూజ చేస్తున్న జగ్గారెడ్డి దంపతులు



సీతమ్మ తల్లి విగ్రహం మెడలో మంగళసూత్రదారణ



హుస్నాబాద్‌లో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు





నాచగిరి క్షేత్రంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

కనుల పండువగా సీతారాముల కల్యాణం

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, ఆశ్రిత జనబాంధవుడు శ్రీరామచంద్రుడి కల్యాణం సిద్దిపేట జిల్లావ్యాప్తంగా బుధవారం కనుల పండువగా జరిగింది. జిల్లాలోని రామాలయాలతో పాటు పలు ఆలయాల్లో నిర్వహించిన కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ఒడిబియ్యం, తలంబ్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో శ్రీరామనవమి వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు, సిద్దిపేటలోని పలు ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో మాజీమంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో సీతారాముల విగ్రహాలను ఊరేగించారు.

మరిన్ని ఫొటోలు 8లో..



సిద్దిపేటలో పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు



పొట్లపల్లిలోని రామాలయంలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



సిద్దిపేటలోని రామాలయంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు





చేర్యాలలోని వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణం అనంతరం ఒడిబియ్యం పోస్తున్న మహిళలు


20న మెదక్‌కు సీఎం రేవంత్

మెదక్, ఏప్రిల్ 17 : కాంగ్రెస్ పార్టీ మెదక్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి నీలం మధు ఈనెల 20న నామినేషన్ దాఖలు చేయనున్నారని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని కాంగ్రెస్ ఇన్‌చార్జి, మంత్రి కొండా సురేఖ తెలిపారు. హైదరాబాద్ శివారులోని శామీర్‌పేటలోని అతిథిగృహంలో నాయకులతో సమావేశమయ్యారు. నామినేషన్ కార్యక్రమానికి భారీ జనసమీకరణ, ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 17: సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తా వద్ద బుధవారం వడదెబ్బతో వ్యక్తి మృతిచెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడికి 30 ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. ఎండకు తిరిగి వడదెబ్బకు గురై మృతిచెందినట్లు డాక్టర్ వెల్లడించారని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తు పడితే సిద్దిపేట వన్ టౌన్ పోలీసులను సంప్రదించాలని చెప్పారు.



తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

ఉరుములు.. మెరుపులు వర్షం

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 17: జిల్లాలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసింది. ఒకేసారి వర్షం కురవడంతో ధాన్యం ఆరబోసిన రైతులు ఇబ్బందులు పడ్డారు. సిద్దిపేటలోని మార్కెట్‌యార్డులో ఆరబోసిన ధాన్యం తడిసింది. ఇక పలుచోట్ల విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. వర్షం కురిస్తే కొంతమేరకు మేలు జరిగినా.. వడగళ్ల వర్షం కురిస్తే చేతికొచ్చిన పంటలు దెబ్బతింటాయని, ధాన్యం నీటిపాలవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.



వర్షానికి సిద్దిపేటలోని మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం



ధాన్యాన్ని ఎత్తి షెడ్ కింద పోస్తున్న రైతులు

విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని మంత్రి దామోదర్‌కు ఆహ్వానం

జోగిపేట, ఏప్రిల్ 17: మండలంలోని కన్‌సాన్‌పల్లిలో చేపట్టనున్న శ్రీరేణుకా ఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరు కావాల్సిందిగా మంత్రి దామోదర్‌ను గౌడ సంఘం సభ్యులు ఆహ్వానించారు. బుధవారం సంగారెడ్డిలోని మంత్రి నివాసంలో వారు కలిశారు. కన్‌సాన్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠాపన క్రతువును ఈనెల 26 నుంచి 29 వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. మంత్రిని కలిసిన వారిలో కన్‌సాన్‌పల్లి మాజీ సర్పంచ్ యాదాగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు సంగమేశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రమేశ్‌గౌడ్, కార్యదర్శి అశోక్‌గౌడ్, సభ్యుడు రవీందర్‌గౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి



మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న దృశ్యం

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 17: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందాడు. సిద్దిపేట పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన పర్వతం కనకయ్య(30) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం సిరిసిల్ల రోడ్డు పక్కన ఉన్న బావిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందాడు. అది చూసిన కొంతమంది వెంటనే పోలీసులకు సమచారం ఇవ్వడంతో టూ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీయడానికి గజ ఈతగాళ్లు రూ.25 వేలు అడిగారు. అన్ని డబ్బులు ఇచ్చేంత స్థోమత మృతుడి కుటుంబ సభ్యులకు లేకపోవడంతో గమనించిన ఏఎస్ఐ ఉమారెడ్డి తానే స్వయంగా బావిలోకి దిగి మృతదేహాన్ని బయటకు తీసి మానవత్వాన్ని చాటుకున్నాడు. అక్కడున్నవారు ఏఎస్‌ని అభినందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌కు భారీ షాక్

● కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీలు, పలువురు మాజీ సర్పంచులు



ఖేడ్‌లో సురేష్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాగల్‌గిద్ద ఎంపీపీ మోతిబాయి, తదితరులు

నిజాంపేట, ఏప్రిల్ 17: నిజాంపేట మండలంలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. బుధవారం ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు, తాజా మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అమర్‌సేనారెడ్డి, పలువురు సర్పంచులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్ ఆధ్వర్యంలో మెదక్ అభివృద్ధిని చూసి పార్టీలో చేరామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చల్మెడ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, తిప్పనగుళ్ల, రజాక్‌పల్లి గ్రామాలకు చెందిన నాయకులు మంగలిపల్లి యాదగిరి, ధర్మా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాగల్‌గిద్ద ఎంపీపీ మోతిబాయి

నారాయణఖేడ్, ఏప్రిల్ 17: ఖేడ్ నియోజకవర్గం నాగల్‌గిద్ద బీఆర్‌ఎస్ ఎంపీపీ మోతిబాయి తన అనుచరులతో బుధవారం మాజీ ఎంపీ, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాగా నిజాంపేట మండలం నాగ్‌ధర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బొడ్ల వెంకటేశంతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు సైతం షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌లో చేరినవారికి షెట్కార్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, తదితరులు పాల్గొన్నారు. అలాగే బీఆర్‌ఎస్ నాగల్‌గిద్ద జడ్పీటీసీ రాజురాథోడ్ ఇటీవల బీజేపీలో చేరగా, తాజాగా ఎంపీపీ కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలినట్లయింది.



ఎమ్మెల్యే రోహిత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ, మాజీ సర్పంచులు

మూడుసార్లు పర్వతారోహణ చేసిన ఎన్‌సీసీ కేడెట్



పర్వాతారోహణ చేస్తున్న రాజేశ్

గజ్వేల్, ఏప్రిల్ 17: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ రాజేశ్ వరుసగా మూడో సారి పర్వతారోహణ చేశాడు. కరోనా సందర్భంగా ఆగిపోయిన ఎన్‌సీసీ పర్వాతారోహణ క్యాంపు పునఃప్రారంభమైన వెంటనే తెలంగాణ నుంచి పర్వాతారోహణ చేసి అరుదైన అవకాశాన్ని పొందాడు. రాజేశ్ ప్రస్తుతం బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మూడేళ్లుగా వరుసగా బేసిక్, అడ్వాన్స్‌డ్, సెర్చ్ అండ్ రెస్క్యూ క్యాంపులను పూర్తి చేశాడని ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఎం.భవానీ తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలిలో 2022 అక్టోబరు 1 నుంచి 26 వరకు బేసిక్ మౌంటెనెరింగ్ క్యాంపులో, పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్‌లో 2023 ఏప్రిల్ 1 నుంచి 28 వరకు అడ్వాన్స్ మౌంటెనెరింగ్ క్యాంపులో పాల్గొన్నాడు. అలాగే 2024 మార్చి 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీవరకు 20రోజుల పాటు ఉత్తరాఖండ్‌లోని ఉత్తర కాశీలో సెర్చ్ అండ్ రెస్క్యూ క్యాంపులో పాల్గొన్నానని రాజేశ్ తెలిపాడు. అంతేకాకుండా బీఎంసీ క్యాంపులో భాగంగా రాక్ క్లైంబింగ్ రివర్ క్రాసింగ్, మంచు పర్వతాలు అధిరోహించడంతో పాటు దాదాపు 14 వేల అడుగుల ఎత్తును ఎక్కినట్లు చెప్పాడు. బీఎంసీ క్యాంపులో భాగంగా అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్‌తో దాదాపు 17 వేల అడుగుల పర్వతారోహణ పూర్తిచేసినట్లు రాజేశ్ పేర్కొన్నాడు. ఆపద సమయంలో ఆదుకునే సెర్చ్ అండ్ రెస్క్యూను నూతన పద్ధతుల ద్వారా శిక్షణ పొందానని, ఈ శిక్షణకు సహాయపడిన సంగారెడ్డి కమాండింగ్ అధికారి కల్నల్ పీఎస్ నందాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు రాజేశ్‌ను అభినందించారు.



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

● కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమి నదిలో పుణ్య స్నానాలు





పొన్నాల సమీపంలోని కిష్టసాగర్ పరిధిలో ఈత వనంలో చెట్లు గీస్తున్న గౌడన్నలు

● హరితహారంలో ఐదు ఎకరాలలో ఐదు వేలకుపైగా మొక్కలు
● ప్రస్తుతం చేతికందిన 600 చెట్లు
● ప్రతిరోజూ 500 లీటర్ల కల్లు
● 60 మంది గౌడన్నలకు ఉపాధి

ఈత.. గౌడ్‌లకు చేయూత



సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 17: సిద్దిపేట అర్బన్ మండలం కిష్టసాగర్ గ్రామంలో హరితహారంలో భాగంగా నాటిన ఈత వనాలు గౌడ్‌లకు ఉపాధిని చూపుతున్నాయి. మొత్తం 600 చెట్ల నుంచి ప్రతిరోజూ 500 లీటర్ల కల్లు వస్తున్నది.

గౌడన్నలకు చేయూతగా ప్రభుత్వాలు

గౌడన్నలకు చేయూతనందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కిష్టసాగర్ గ్రామ సమీపంలో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అయితే మొన్నటివరకు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం హరితహారంలో భాగంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితో సుమారు 5 వేల ఈత మొక్కలను దశలవారీగా గౌడన్నలు నాటుకున్నారు. వాటి సంరక్షణ కోసం 60 మంది గౌడ కులస్తులు సొసైటీ ఏర్పాటు చేసుకుని పరిరక్షిస్తున్నారు.

మొక్కలు ఎదిగి..

దశలవారీగా నాటుకున్న 5 వేల ఈత మొక్కలలో ప్రస్తుతం 600కు పైగా ఈత చెట్లు చేతికందాయని గౌడ కులస్తులు చెబుతున్నారు. రోజూ 300 చొప్పున ఈత చెట్లకు కల్లు గీస్తున్నారు. రోజుకు సుమారు 500 లీటర్ల స్వచ్ఛమైన కల్లు లభిస్తుంది. వచ్చేనెల 15 రోజుల్లో మరో 600 చెట్లు చేతికిందే అవకాశం ఉండడంతో మరింత లబ్ధి చేకూరే అవకాశం ఉన్నది.

ఆర్థిక భరోసాకు చక్కటి మార్గం

గతంతో పోల్చుకుంటే గ్రామాల్లో ఈత వనాల సంఖ్య పూర్తిగా తగ్గిపోవడంతో గౌడ కులస్తులకు ఉపాధి తగ్గే పరిస్థితి వచ్చింది. ఆ సందర్భంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు కృషితో గౌడ కులస్తులకు ఈత మొక్కలను పంపిణీ చేశారు. గౌడ సొసైటీలకు సంబంధించిన స్థలం ఎక్కడుంటే అక్కడ మొక్కలను నాటుకోవడానికి అవకాశం కల్పించింది. ఈ అవకాశమే నేడు పొన్నాల గౌడ కులస్తులు ఆర్థికంగా ఎదగడానికి చక్కటి మార్గాన్ని చూపింది. సొసైటీలో మొత్తం 60 మంది సభ్యులు ఉండగా.. కొంతమంది కార్మికులు ఆరోగ్యరీత్యా, వయస్సు రీత్యా వృత్తిలోకి రానప్పటికీ మిగతా గౌడన్నలు వారి చెట్లను దత్తత తీసుకొని వృత్తిని కొనసాగిస్తున్నారు.

చేతినిండా పని దొరుకుతుంది

గతంలో పని దొరక్క అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతానికి ఈత వనంలో వందల సంఖ్యలో చెట్లు చేతికందడంతో పని దొరుకుతుంది. ఆర్థికంగా కూడా చక్కటి అవకాశం లభిస్తుంది.

- సురేష్‌గౌడ్, పొన్నాల

కులవృత్తులను ప్రోత్సహించడానికే..



కులవృత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా అన్నిరంగాల కులస్తుల ఆర్థికాభివృద్ధికి అవసరమైన సహాయ, సహకారాలను అందించాం. అవకాశాలను సద్వినియోగపర్చుకుని గౌడన్నలు ఆర్థికంగా ఎదగడం సంతోషాన్నిస్తుంది. కులవృత్తులను ఉపయోగించుకుని అన్ని కులాల వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నాం.

- హరీశ్‌రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే

ఆర్థికంగా మాకు ఎంతో అండ



గ్రామీణ ప్రాంతాల్లో ఈతవనాల సంఖ్య తగ్గిపోవడంతో కులవృత్తులు చేపట్టలేక ఇతర వృత్తుల కోసం వెతికే సమయంలో ప్రభుత్వాల అండదండలతో ఏర్పాటు చేసుకున్న ఈత వనం మా ఆర్థికాభివృద్ధికి అండగా నిలబడింది. పనులు చేతి కందని సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో 600 చెట్లు చేతికంది మాకు లాభాలను అందిస్తున్నాయి.

- బొల్లం శ్రీనివాస్‌గౌడ్, పొన్నాల



కల్లును విక్రయిస్తున్న గౌడ కులస్తులు



ఏపుగా పెరిగిన ఈతవనం


సిద్దిపేట అర్బన్: వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ


వర్గల్: నాచారం శ్రీ లక్ష్మీనృసింహ క్షేత్రంలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు, స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న ఆలయ ఈవో అన్నపూర్ణ


సిద్దిపేట రూరల్: చింతమడకలో ప్రత్యేక అలంకారంలో సీతారాముల విగ్రహాలు


చేర్యాల: కొమురవెల్లి మల్లన్నక్షేత్రంలోని ఆంజనేయ ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం


దుబ్బాక: పోతారంలో సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి దంపతుల పూజలు


మిరుదొడ్డిలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు


గజ్వేల్: దిలాల్‌పూర్‌లో నిర్వహించిన కల్యాణోత్సవంలో వెంకట్రామారెడ్డి దంపతులు


హుస్నాబాద్ రామాలయంలో కల్యాణోత్సవం


హుస్నాబాద్: కల్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత


గజ్వేల్‌లోని సత్యసాయి ఆలయంలో కల్యాణోత్సవ వేడుకల్లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి


హుస్నాబాద్‌రూరల్: సీతారామచంద్రమూర్తిని ఊరేగిస్తున్న భక్తులు

రాములోరి కల్యాణ వైభోగం

● జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు ● ఆకట్టుకున్న శోభాయాత్రలు.. కల్యాణ ఘట్టాలు ● జిల్లాలో ఆధ్యాత్మిక సందడి

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోని గల ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పచ్చటి తోరణాలతో ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి ఉత్సవ విగ్రహాలను అందులో ఉంచి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవ ఘట్టాలను అద్భుతంగా ఆవిష్కరించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలతో భజన కీర్తనల మధ్య శోభాయాత్రలు చూపరులను ఆకట్టుకున్నాయి. కల్యాణ వేడుకల సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీ సభ్యులు, బాధ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. హుస్నాబాద్‌లోని మార్కండేయ ఆలయంలోని శ్రీరామాలయం, శివాజీనగర్‌లోని హనుమాన్ ఆలయం, వైశ్య భవన్‌ల్లో, అలాగే హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో, అక్కన్నపేట మండలంలోని కట్కూర్‌లోని రామాలయంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంజుల దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హుస్నాబాద్ మార్కండేయ ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సిద్దిపేట పట్టణంలో పలుచోట్ల నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తదితరులు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ప్రభుత్వం తరఫున ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. వర్గల్ కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఆలయ వేద పండితులు వేదాంతం మురళీధర చార్యుల నేతృత్వంలో వైభవంగా నిర్వహించారు. దుబ్బాక మండలంలోని శ్రీవెంకటేశ్వరాలయం, శ్రీఅంజనేయస్వామి ఆలయాలతో పాటు పోతారంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే కొత్తప్రభాకర్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే మిరుదొడ్డి, చేర్యాల, వర్గల్, చిన్నకోడూరు, మండలాల్లోని వివిధ గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని శ్రీకృష్ణాలయం, సత్యసాయిమందిరం, దిలాల్‌పూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయం, నల్లవాగు హనుమాన్ ఆలయం, పిడిచెడ్‌లోని పోచమ్మ ఆలయంలో, జగదేవ్‌పూర్ మండలంలోని జంగంరెడ్డిపల్లిలోని రామునిబండలో, కుకునూర్‌పల్లి మండలంలోని చిన్నకిష్టాపూర్‌లో జరిగిన సీతారాముల కల్యాణోత్సవ వేడుకల్లో బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి దంపతులు, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. వారివెంట ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి ఉన్నారు. చిన్నకోడూరు మండలంలోని మాచాపూర్, మేడిపల్లి, రామన్నపల్లి, కస్తూరిపల్లి గ్రామాల్లోని పలు ఆలయాల్లో నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణోత్సవాల్లో మాజీమంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తొగుట మండలంలోని రాంపూర్ కోటిలింగాల ఆలయంలో రంగంపేట ఆలయ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి, శ్రీ మధుసూదనానంద స్వామి పర్యవేక్షణలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ రామాలయంలో ఆలయ ధర్మకర్త అన్నంరెడ్డి సుభాష్‌రెడ్డి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య సీతారాములోరి కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప, గొల్లపల్లి, చాట్లపల్లి, బీజీ వెంకటాపూర్, జంగంరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో కల్యాణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాయపోల్ మండలం వడ్డెపల్లి, రాయపోల్, అనాజీపూర్ తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. మద్దూరు మండలం గాగిళ్లాపూర్‌లోని శివాలయంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మర్కుక్ మండలం అంగడికిష్టాపూర్ గ్రామం కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ములుగు, క్షీరసాగర్, కొక్కొండ, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ధూళిమిట్ట రామాలయం, బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయం, జాలపల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో కల్యాణ వేడుకలకు భక్తులు విశేషంగా హాజరయ్యారు.


హుస్నాబాద్: ఆలయంలో కూచిపూడి నృత్యం చేసిన చిన్నారులతో మంత్రి పొన్నం ప్రభాకర్


నారాయణరావుపేట: గుర్రాగొందిలో సీతారాముల కల్యాణోత్సవం


చిన్నకోడూరు: కస్తూరిపల్లి భక్తాంజనేయ స్వామి ఆలయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు పూజలు


తొగుట: రాంపూర్ కోటిలింగాల ఆలయంలో కల్యాణోత్సవంలో రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతీస్వామి పూజలు, పాల్గొన్న భక్తులు


దౌల్తాబాద్: ఇందుప్రియాల్‌లో సీతారాముల కల్యాణోత్సవం


వర్గల్: మైలారం గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో గ్రామస్థులు


మద్దూరు: గాగిళ్లాపూర్‌లో శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు


చిన్నకోడూరు: మాచాపూర్ రామలింగేశ్వర ఆలయంలో కల్యాణ వేడుకలు


మర్కుక్: శ్రీసీతారాముల కల్యాణోత్సవం


ధూళిమిట్ట: జాలపల్లి వేణు గోపాలస్వామి ఆలయంలో శ్రీ రామనవమి వేడుకలు


సిద్దిపేట రూరల్: చింతమడకలో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన గ్రామస్థులు


నారాయణరావుపేట: జక్కాపూర్‌లో సీతారాముల విగ్రహాల ఎదుర్కోళ్లు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


భాను (ఫైల్)

మర్కుక్, ఏప్రిల్ 17: మండలంలోని పాములపర్తిలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన లెంకల భాను(24) బుధవారం ఉదయం నూతనగృహం గోడలకు నీరు పడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి మృతి చెందాడు. బోర్‌మోటర్ వైర్ సరిగా లేనందున విద్యుత్ తీగపై నీరు పడడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. చుట్టుపక్కలవారు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

హుస్నాబాద్, ఏప్రిల్ 17 : హుస్నాబాద్ పట్టణం హన్మకొండ రోడ్డులోని ఓ వ్యాపారి వద్ద 15 క్వింటాళ్ళ అక్రమ రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. వీటిని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. అయితే ఇంకా కేసు మాత్రం నమోదు కాలేదని తెలిసింది.

వడ్డీ వ్యాపారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

● జేఏసీ చైర్మన్ చక్రధర్

చేర్యాల, ఏప్రిల్ 17: ప్రభుత్వ అనుమతులు లేకుండా చేర్యాల పట్టణంలో అక్రమ వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని చేర్యాల జేఏసీ చైర్మన్ భైరవభట్ల చక్రధర్ పేర్కొన్నారు. బుధవారం చేర్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలు, చిరువ్యాపారుల అవసరాలను ఆసరా చేసుకుని పలువురు వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ నిర్వాహకులు ఇష్టానుసారం దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. 10శాతం వడ్డీని వసూలు చేస్తున్న ఫైనాన్స్ నిర్వాహకులు నాగశేఖర్‌రెడ్డి, అతడి భాగస్వాములను పోలీసులు అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే డైలీ ఫైనాన్స్‌ల పేరిట రోజూ అక్రమవసూళ్లకు పాల్పడుతున్న నర్సింహులు, రమేశ్, శ్రీనివాస్, సిద్దేశ్వర్, రాజిరెడ్డిలపై సుమోటోగా చట్టపర చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలను పీడిస్తున్న వడ్డీవ్యాపారులందరిని విచారించాలని డిమాండ్ చేశారు. పలువురు బాధితులు జేఏసీకి మొర పెట్టుకున్నారని, త్వరలోనే వారితో కలిసి రుణ విమోచన కమిషన్ చైర్మన్‌కు విన్నవించనున్నట్లు తెలిపారు.

వెంకట్రామారెడ్డిని అవమానించడం సరికాదు: ఎంపీపీ

మిరుదొడ్డి, ఏప్రిల్ 17: మండలంలోని కాసులాబాద్ గ్రామంలో యాదగిరి అనే వ్యక్తి బీఆర్‌ఎస్ మెదక్‌పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డిపై చెప్పుల దండవేసి అవమానపరచడం సరికాదని మిరుదొడ్డి ఎంపీపీ ఉపాధ్యక్షుడు పోలీస్ రాజులు మండిపడ్డారు. బుధవారం మిరుదొడ్డిలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. గతంలో సిద్దిపేట కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామారెడ్డికి పారం పోగుభూమిని తమపేరున చేయాలని యాదగిరి దరఖాస్తు చేసుకోగా, సదరు వ్యక్తి కబ్జాలో కూడా లేడని కిందిస్థాయి అధికారుల ద్వారా తెలుసుకుని ఫైల్‌ను పక్కన పెట్టినట్టు తెలిపారు. వెంకట్రామారెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు.ఈ విషయమై మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని గుర్తుచేశారు. అలాగే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి యాదగిరిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు దుర్గారెడ్డి, బాపురెడ్డి, సుకూరి లింగం, మల్లేశంగౌడ్, సత్యనారాయణ, మల్లయ్య తదితరులున్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి


నాగిరెడ్డిపల్లి హనుమాన్ టెంపుల్ వద్ద బీజేపీ నాయకుల పూజలు

ములుగు, ఏప్రిల్ 17: గత పదేళ్లలో కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని సిద్దిపేట జిల్లా యువమోర్చా కార్యదర్శి పల్లెభూపాల్ పేర్కొన్నారు. బుధవారం ములుగు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో బీజేపీ కార్యకర్తలు హనుమాన్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ రాముని బ్యానర్ ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామపంచాయతీ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కరోనా కష్టకాలంలో పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్‌బియ్యం అందించిన ఘనత కేంద్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు నవీన్, అన్నబోయిన గోపి, పల్లె ప్రవీణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

24న మామిడి చెట్ల ఫలసాయం టెండర్లు

ములుగు, ఏప్రిల్ 17: మండల కేంద్రమైన ములుగు ఉద్యాన నర్సరీలోని మామిడిచెట్ల ఫలసాయం టెండర్లను కోరినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ కె. కిషన్‌రావు తెలిపారు. బుధవారం మండల కేంద్రం ములుగులో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ మీటింగ్‌హాల్‌లో ఈ నెల 24 ఉదయం 11 గంటలకు మామిడి పండ్ల టెండర్ పిలువనున్నట్లు తెలిపారు. బహిరంగ వేలంలో ఎక్కువ మొత్తం ధర పలికిన వారికి మాత్రమే అనుమతిస్తామని పేర్కొన్నారు. వేలంలో నెగ్గినవారు పాట మొత్తంలో సగం నగదు చెల్లించాల్సి ఉంటుందని, అలా చెల్లించకపోతే ఆ టెండర్‌ను రద్దు చేసి రెండో వ్యక్తికి అనుమతిస్తామని తెలిపారు. సొమ్మును చెల్లించిన తర్వాతే పంట కోసేందుకు అనుమతిస్తామని తెలిపారు.

బీజేవైఎం మండల కమిటీ నియామకం


నియామకపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 17: బుధవారం మండల కేంద్రంలో బీజేపీ యువ మోర్చా కుకునూరుపల్లి కమిటీని బీజేపీ మండల అధ్యక్షుడు అనుముల సంపత్ రెడ్డి సమక్షంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు ఈసాల నవీన్ ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా ప్రదీప్, రాకేశ్, ఉమాకాంత్, అభిలాష్‌గౌడ్, లింగంలను, ప్రధాన కార్యదర్శిగా బోనగారి చందు, రాజ్‌కుమార్‌లను, కార్యదర్శులుగా స్వామి, రాజశేఖర్, కరుణాకర్, విజయ్, భాను, కోశాధికారిగా రాగం మహిపాల్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా గొడుగు మధు పలువురిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు


కాంగ్రెస్‌లో చేరినవారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 17: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా నీలం మధును గెలిపించుకుందామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ ప్రెసిడెంట్ తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు జంగం వెంకట్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకుడు రాజుగౌడ్ తదితరులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి నర్సారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనవెంట కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు మోహన్నగారి రాజు, ప్రధాన కార్యదర్శి రాములు, నాయకులు తదితరులు ఉన్నారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని అంగడిపేట హనుమాన్ ఆలయం వద్ద గజ్వేల్-ప్రజ్ఞాపూర్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళితో కలసి చలివేంద్రాన్ని ప్రారంభించారు.

25 కోట్ల లిఖిత రామ నామాలతో అభిషేకం

గజ్వేల్‌టౌన్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి పురస్కరించుకొని గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో 25 కోట్ల లిఖిత శ్రీరామ నామాలతో శ్రీ సీతారాములకు అభిషేకాలను సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు నిర్వహించారు. అద్దాల మందిరం వద్ద భజనలతో, రామనామ స్మరణతో ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామనామ స్మరణతో ఆనందం లభిస్తుందని, ప్రతి రోజూ రామనామాన్ని లిఖించుటానికి కొంత సమయం కేటాయించుకోవాలన్నారు.

నేడు భువనగిరిలో సీపీఎం అభ్యర్థి నామినేషన్

చేర్యాల, ఏప్రిల్ 17: భువనగిరి లోక్‌సభస్థానం సీపీఎం అభ్యర్థి జహంగీర్ నేడు భువనగిరిలో నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆ పార్టీ కొమురవెల్లి మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి తెలిపారు. బుధవారం కొమురవెల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై పార్లమెంటులో ప్రశ్నించే గొంతుకగా జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

చేర్యాల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అహ్మద్‌ఖాన్

చేర్యాల, ఏప్రిల్ 17 : హుస్నాబాద్ ఆర్డీవో కార్యాలయ డీఏవో అహ్మద్‌ఖాన్‌ను చేర్యాల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. కొద్దిరోజుల క్రితం చేర్యాల తహసీల్దార్‌గా విధుల్లోకి చేరిన సమీర్ అహ్మద్‌ఖాన్ ఇటీవల అనారోగ్యంతో అస్వస్థతకు గురై సెలవుపెట్టారు. దీంతో అహ్మద్‌ఖాన్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఆలయానికి హుండీ బహుకరణ

కుకునూరుపల్లి, ఏప్రిల్ 17: బుధవారం మండల పరిధిలోని లకుడారం గ్రామంలో వెలసిన శ్రీ దండు మైసమ్మ తల్లి ఆలయానికి ఆటోట్రిమ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యజమానులు ఠాగూర్ నవీన్ సింగ్, ఠాగూర్ నాగేందర్ సింగ్ రూ. 26వేల విలువ చేసే హుండీని ఆలయానికి బహూకరించారు.

సీఎం మాటలను మాదిగలు నమ్మరు


గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు

గజ్వేల్, ఏప్రిల్ 17: రేవంత్‌రెడ్డి మాటలను మాదిగలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు మైస రాములు పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని హరితా రెస్టారెంట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాములుతో కలసి వారు మాట్లాడుతూ మాదిగలను పార్లమెంట్‌కు వెళ్లడానికి అవకాశం ఇవ్వని వారు వర్గీకరణ చేస్తామనడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. రెడ్డిలకు, మాదిగలకు ఇచ్చిన పదవులు ఎన్నో రేవంత్‌రెడ్డి లెక్కలు బయట పెట్టాలన్నారు. మాదిగలకు ఒక్క సీటు ఇవ్వకుండా వర్గీకరణ చేస్తామంటే నమ్మడానికి మాదిగలు అమాయకులు కాదన్నారు. రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీంకోర్టులో నియమించిన అడ్వకేట్ ఎవరో చెప్పాలన్నారు. ఫిబ్రవరి 6, 7, 8 తేదీల్లో సుప్రీంకోర్టులో విచారణ జరిగితే 6వ తేదీన మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో సుప్రీంకోర్టుకు వచ్చిన బృందం ప్రెస్‌మీట్ పెట్టి వివేక్‌టాంకా అనే న్యాయవాదిని తెలంగాణ ప్రభుత్వం తరపున నియమిస్తున్నట్లు ప్రకటించారని, 7వ తేదీన జరిగిన విచారణలో వివేక్ టాంకా పాల్గొనలేదన్నారు. మరి ఎవరు వాదనలు వినిపించారో రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. 7వ తేదీన సిద్దార్థలుద్రా అనే న్యాయవాదిని ఆఘమేఘాల మీద నియమిస్తే కనీసం వర్గీకరణ మీద అధ్యయనం చేసే సమయం కూడా లేదని, అందువల్ల కోర్టు హాల్‌లోనే మందకృష్ణ మాదిగ లుద్రాకు వర్గీకరణ ప్రాముఖ్యతను వివరించి కోర్టులో వినిపించాల్సిన అంశాలను వివరిస్తే వాటిని లుద్రా కోర్టులో వినిపించారన్నారు. ఇందులో రేవంత్‌రెడ్డి పాత్ర ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలను దూరం చేసుకుంటుందని, అందుకు కారకుడు ఖర్గే, రేవంత్‌రెడ్డి మాత్రమేనన్నారు. వారితో ఎంఎస్‌పీ గజ్వేల్ కో-ఇన్‌చార్జి శ్రీహరిసింధు, ఎమ్మార్పీఎస్ గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ శనిగరి రమేష్, గజ్వేల్ మండల అధ్యక్షుడు ఉబ్బని ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి చిట్యాల రవీందర్, ఉపాధ్యక్షులు బొంది స్వామి, కోశాధికారి బురికి ప్రశాంత్, నాయకులు కరుణాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు దక్కవు


గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ ప్రచార రథాలను ప్రారంభిస్తున్న యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 17: కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు కూడా దక్కవని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. గజ్వేల్‌లోని గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ ప్రచార రథాలను బుధవారం వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీజేపీకి లీడర్లు లేరన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో ఓ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాలుగు మాసాల్లో వసూళ్లకు పాల్పడుతూ వసూల్‌రాజాగా మారాడని మండిపడ్డారు. గత ప్రభుత్వం కేటాయించిన రూ.150 కోట్ల అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంపై స్థానిక నాయకులు స్పందించకపోవడాన్ని తప్పుబట్టారు. మెదక్ పార్లమెంట్ బరిలో నిలిచిన అభ్యర్థుల్లో వెంకట్రామారెడ్డి విజయం సాధించి గులాబీ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వారివెంట గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ జడ్పీటీసీ పంగ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.